# తనదాకా వస్తే?....

రచన:
పిల్లా సుబ్బారావు శాస్త్రి.

అతనొక ప్రఖ్యాత రచయిత. అతని పేరు ప్రకాశ్. ఆయన యెన్నో రచనలు వ్రాశాడు. ఎన్ని కథలూ, ఎన్ని నాటకాలూ అన్నీ నీతిబోధక మయినవే...!

ఈ మధ్య కట్నాల సమస్య గురించి చిత్రం వచ్చింది తెలుసా? ఆ చిత్రానికి కథ రాసిన దెవరూ...? మనప్రకాశ్...! ట్...ట్... ఎంత గొప్పగా వ్రాశాడనుకున్నారు...? చిత్రం శతదినోత్సవం కూడా చేసుకొని యింకా ఆడుతూనే వుంది...?

'కట్నం...! ఈ పిశాచి మానవుల్ని పీడించి పిప్పి చేస్తోంది! ఎందరో మహిళల గొంతులు కోస్తోంది!! పిల్లనిచ్చేవాళ్లు వున్న వాళ్ళయినా, లేనివాళ్ళయినా కట్నం యివ్వాల్సిందే!... కట్నం యిచ్చుకోలేనివాళ్ళ పిల్లగతి యేంగావాలి...? ఏ ముసలాడికో కట్టబెట్టాలి...! మీరు కట్నానికి, ఆ పిల్లకి అమ్ముడు బోతున్నారా...? కట్నం యిచ్చి ఆ పిల్ల మగవాణ్ని కొనుక్కుంటే. మగవాడు చెప్పినట్టూ ఎందుకు నడుచుకోవాలీ? ఆమె చెప్పినట్టే మీాద నడుచుకోవాలి'' – సభలో చప్పట్లు! ఆయన ఎంతో బ్రహ్మాండంగా ఉపన్యాసం యిచ్చాడు.

''ఎవరిదీ పెళ్ళి...?''—మన ప్రఖ్యాత రచయితదే...! అబ్బ...ఎంతమందివచ్చారు? పెళ్ళికూతురుకూడా ఒక రచయిత్రేనట...! అందమయిన పిల్ల.

పెళ్ళి జరుగుతోంది – ఏమిటా గొడవా...? అరె! పెళ్ళికొడుకు లేచిపోయాడే...!అబ్బా.. అంతా గొడవగావుందే...!

''ఏమిటండీ?'' అన్నాను నాలాటి చిన్న రచయిత భుజంతట్టి. ఆయన చెప్పారు—

''ఆ...ఏం లేదు...! కట్నం కొంత యిచ్చారుట! అలా వీల్లేదని...''

ఏమిటీ...ఈ ప్రఖ్యాతరచయితకి కూడా కట్నం గావాలా...!?

''తండ్రిమాట శాదన గలడండీ!'' ఆయ నెవరో అన్నాడు.

''ఏం, సభలో చెప్పగలడూ, 'తల్లిదండ్రులనేగాదు యీ విషయంలో దేవుణ్ని కూడా ఎదిరించాలి...!' అని...!'' అన్నాను.

''అది మీాకూ. మాకూనూ..! చెయ్యండి, ఎదిరించండి, అన్నాడేగాని 'చేద్దాం, ఎదిరిద్దాం, ఎదిరిద్దాం' అనలేదుగా...!''

''అవునవును...! ఏదయినా 'తన దాక వస్తేగాని తెలీదు' లెండి...!'' అంటూ నా మిత్రుడితో వచ్చేశాను.—నేను మళ్ళీ ఆహ్వానం వచ్చింది గాని పెళ్ళికి వెళ్లలేదు. పెళ్ళికూతురు యిదివరకటి రచయిత్రి గాదు. ఒక ప్రసిద్ధ సినీతార...!—నాకు పెళ్ళిగాలేదుకాని, నేనూ అంతేనేమో...! మీరూ అండీ...!! అంతా మాటల్లో ఒకటే, చేతల్లో వేరొకటీ...!!! అంతే గదూ...?